సాక్షి నిజామాబాద్

బుధవారం । 24 । జూలై । 2024



మాక్లూర్ సొసైటీలో విచారణ

మాక్లూర్ సొసైటీలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు.

- IIలో ▸



రాష్ట్రస్థాయిలో ప్రతిభ

ఓయూలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాణిజ్య సదస్సులో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ చాటారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /24.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

సుభాష్‌నగర్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలతో ప్రజల కు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్ 08462–220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ నిరంతరం పని చేస్తుందని తెలిపారు.

పశుసంవర్ధక శాఖలో పూర్తయిన బదిలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ బదిలీలకు కౌన్సెలింగ్ పూర్తయింది. జోనల్, మల్టీ జోనల్ పోస్టులకు రాష్ట్ర శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ జరిగింది. శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న బాలిక్ అహ్మద్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. అదే విధంగా మండల స్థాయిలో ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు కూడా బదిలీలు జరిగాయి. త్వరలోనే బదిలీల ఉత్తర్వులు రానున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో..

సుభాష్‌నగర్: జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ల బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఐదు సబ్‌రిజిష్టర్ కార్యాలయాల్లో పది మంది సీనియర్ అసిస్టెంట్లు ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు బదిలీ అయ్యారు. ఆయా జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. 25 మందికి పైగా జూనియర్ అసిస్టెంట్లు, 15 మంది వరకు అటెండర్లు బదిలీ అయ్యారు. త్వరలో సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు.

నిజాంసాగర్‌లోకి 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,387.98 అడుగుల(3.286 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం నీటిమట్టం నిలకడగా ఉంది.

పదోన్నతులతో ఖాళీల భర్తీ

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో మిగిలిపోయిన ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం సబ్జెక్టుల వారిగా ఖాళీల వివరాలను వెల్లడించారు. ఇటీవల చేపట్టిన ప్రమోషన్లలో కొందరు టీచర్లు సబ్జెక్టుల వారిగా రెండు నుంచి మూడు ప్రాంతాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒక ప్రాంతంలో పదోన్నతి పొందగా.. మిగిలిన ప్రాంతాలు ఖాళీ ఏర్పడ్డాయి. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఇలా 60 ఖాళీలను గుర్తించారు. వీటి భర్తీతో ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందనున్నారు. దీనికి సంబంధించి ఉపాధ్యాయుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సీనియారిటీ జాబితాలో ఉన్న వారు బుధవారం డిక్లరేషన్ ఇవ్వాలని అధికారులు పేర్కొన్నారు.

‘డైట్’ ప్రిన్సిపాల్‌పై విచారణ!

నిజామాబాద్ అర్బన్: నగరంలోని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై విచారణకు వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం వచ్చారు. ఆయన అక్రమాలు, వేధింపులకు పాల్పడినట్లు విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో విచారణకు ఆర్జేడీని నియమించారు. ఆయన కాలేజీకి రాగా విద్యార్థులు, ఫిర్యాదు చేసినవారు అందుబాటులో లేరు. ఎవరు లేకపోవడంతో మరోసారి విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు ఆయనతో వాగ్వాదం చేశారు. దీంతో ఆర్జేడీ వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఛాత్రోపాధ్యాయులను వేధించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా 34 ఏళ్లుగా ఒకేచోట ఉద్యోగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకపక్ష విచారణను వాయిదా వేసి ఫిర్యాదు చేసిన ఛాత్రోపాధ్యాయులు, పీడీఎస్‌యూ నాయకుల సమక్షంలో విచారణ చేపట్టాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు గణేశ్ పేర్కొన్నారు.

మహిళలకు పెద్దపీట

- మహిళాభివృద్ధికి భారీగా కేటాయింపులు
- మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్లకు స్టాంప్ డ్యూటీ తగ్గింపు
- తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఈ విషయమై ఇప్పటికే ప్రధానికి విన్నవించిన ఎంపీ అర్వింద్
- వ్యవసాయ స్టార్టప్‌లు, పరిశోధనలకు ప్రాధాన్యంతో జిల్లాకు మేలు
- వ్యవసాయరంగంలో డిజిటల్ టెక్నాలజీ
- ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌పై నిరాశ
- పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. మహిళాభివృద్ధికి భారీగా రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మహిళల సంఖ్య అత్యధికంగా ఉంది. ముద్ర రుణాల పరిమితిని పెంచారు. మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ తగ్గించారు. బంగారం, వెండిపై పన్నులు తగ్గించడంతో మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోంది. వీటి ధరల తగ్గింపుపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి విన్నవించారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించారు. వ్యవసాయాధారిత నిజామాబాద్ జిల్లాలో దీనిపై ఆసక్తి నెలకొంది. వ్యవసాయరంగంలో డిజిటల్ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇచ్చేందుకు నిర్ణయించారు. వ్యవసాయ పరిశోధనలకు, స్టార్టప్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని, కూరగాయల సాగు ప్రోత్సాహానికి ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకాలపై, లక్కంపల్లి సెజ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు విషయమై ఆశలు నెలకొన్నాయి.

■ చిన్న విమానాశ్రయాల నిర్మాణానికి ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించినందున జిల్లాలోని జక్రాన్‌పల్లి విమానాశ్రయం కోసం తీసుకునే చర్యలపై ఆసక్తి నెలకొంది. ఇక ప్లాస్టిక్ వస్తువులపై 25 శాతం పన్ను పెంచడంపై మంచి స్పందన వ్యక్తమవుతోంది.

■ ఉత్తర తెలంగాణలో అత్యధికంగా ఉన్న గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు ప్రత్యేక గల్ఫ్ పాలసీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్ ప్రస్తావన లేకపోవడంతో నిరాశ నెలకొంది.

అన్నివర్గాల సంక్షేమం లక్ష్యంగా..



వికసిత్ భారత్ లక్ష్యంగా తొమ్మిది ప్రాధాన్య అంశాలతో బడ్జెట్ రూపొందించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పట్టణాల్లో గృహ నిర్మాణం కోసం రూ.2.2 లక్షల కోట్లు కేటాయించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు భారీ ప్రాధాన్యత ఇచ్చారు. మరో ఐదేళ్ల పాటు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించడం జరుగుతుంది. ఉన్నత విద్య చదివే వారికి రూ.10 లక్షల రుణ సదుపాయం కల్పించారు. ముద్ర రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. వచ్చే ఐదేళ్లలో యువతకు 4 కోట్ల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఉన్నట్లు బడ్జెట్‌లో చెప్పారు. పేదరికాన్ని దూరం చేసి అందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి పెట్టడంతో పాటు మహిళల రక్షణ, మహిళా సాధికారిత దిశగా అడుగులు వేగంగా వేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలి.

– దినేశ్ పటేల్ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తెలంగాణకు అన్యాయం చేశారు



విభజన చట్టంలో ఉన్న హామీలన్నింటినీ గాలికొదిలేశారు. రాష్ట్రానికి నవోదయ విద్యాలయాలు, మెడికల్ కాలేజీలు ఇవ్వలేదు. పసుపుబోర్డుకు నిధులు కేటాయించలేదు. రైల్వే ప్రాజెక్టుల ఊసే లేదు. తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో రాష్ట్రం ఊసే లేకుండా పోయింది. ఇప్పటికైనా బీజేపీ ఎంపీలు, మంత్రులు సోయి తెచ్చుకోవాలి.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, బాల్కొండ

యువత, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



యువత, మహిళలు, రైతుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ముందుకెళుతోంది. మహిళాభివృద్ధి ద్వారా భారత్ పునాదిని బలోపేతం చేయడమే కాకుండా మహిళల స్వావలంబనను పెంచుతుంది. మౌలిక సౌకర్యాల కోసం రూ.11.11 లక్షల కోట్లు కేటాయించడం మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. గ్రామీణాభివృద్ధికి రూ.2.56 కోట్లు, అర్బన్ హౌజింగ్ కోసం రూ.2.2 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయం. యువతలో విద్య, ఉద్యోగాల నైపుణ్య శిక్షణ కోసం రూ.2 లక్షల కోట్లు కేటాయించారు. పీఎం ప్యాకేజీ కింద యువత కోసం 5 పథకాలు ప్రవేశపెట్టడం గొప్పవిషయం. – ఎంపీ అర్వింద్

తెలంగాణపై మోదీ ప్రభుత్వం అక్కసు..



నరేంద్రమోదీ ప్రభుత్వం తెలంగాణకు ఏమాత్రం నిధులు ఇవ్వకుండా తన అక్కసు వెళ్లగక్కింది. రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ చిన్నచూపు చూడడం శోచనీయం. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు నిధుల విషయమై ఊసే లేదు. ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్‌ను అసలు పట్టించుకోలేదు. ఇది ఈ జిల్లాల ప్రజల చిరకాల కోరిక. రెండు చోట్లా బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఉత్తచేతులు చూపింది. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు. ఉద్యోగాల పేరిట యువతను మోసం చేస్తోంది. బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉంది.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్

పనులను నాణ్యతతో చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సిరికొండ: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రజా పాలన సేవా కేంద్రం, గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సిరికొండ, వాల్గోట్ కలాన్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పనులు పూర్తయిన వాటికి తక్షణమే ఎంబీ రికార్డు చేయాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు.



సిరికొండ ఆశ్రమ పాఠశాలలో మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మెరుగైన వైద్యం అందించాలి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వైద్యుల కొరత ఉన్న చోట కాంట్రాక్టు పద్ధతిన డాక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలు, వసతి గృహాలను వారానికి ఒకసారైనా వైద్యులు సందర్శించి విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి సైతం పరీక్షలు జరపాలని ఆదేశించారు. డీఆర్డీవో సాయాగౌడ్, మండల ప్రత్యేకాధికారి నాగోరావ్, డీఎంహెచ్‌వో తుకారాంరాథోడ్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ నాయక్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ రవీందర్‌రావు పాల్గొన్నారు.

28న ఊర పండుగ

నిజామాబాద్ అర్బన్: సర్వసమాజ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 28న ఆదివారం నగరంలో ఊర పండుగ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం శ్రీ విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం, గాజులపేట్ అధ్వర్యంలో బండారు పోశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సర్వసమాజ్ కమిటీ కో కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడు సుంకటి ప్రవీణ్, పట్లే వెంకటరమణ, పాలంచ గంగాధర్, కోరడి గోపి, భైర గంగ శైలేందర్, నర్సయ్య, కోర్వ భూపాల్, భైర గంగ ప్రసాద్, లక్ష్మీనారాయణ, సతీష్, అశోక్, బాలకిషన్, సుదర్శన్, భూమన్న, భోజన్న, చక్రధర్, నాగభూషణ్, సాయిబాబా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గాజులపేటలో బండారు పోస్తున్న రెడ్డికా సంఘం నాయకులు

రెడ్డికా సంఘం ఆధ్వర్యంలో..

నగరంలోని పెద్దరామమందిర్ గాజులపేట వద్ద రెడ్డికా సంఘం ఆధ్వర్యంలో ఊర పండుగకు సంబంధించి బండారు కార్యక్రమం నిర్వహించారు. సతీష్, సాయిరాం, పంతులు, సురేష్, భాను, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

భోజనంలో బొద్దింక

- మారని తెయూ హాస్టల్ తీరు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్ అధికారులు, సిబ్బంది తీరు మారడం లేదు. వర్సిటీ న్యూ బాయ్స్ హాస్టల్‌లో గుడ్డుకూరలో బొద్దింక వచ్చింది. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో ఒక విద్యార్థి కూర వేసుకోగా అందులో బొద్దింక వచ్చింది. వెంటనే ఈ విషయం కేర్‌టేకర్ దృష్టికి తీసుకెళ్లగా కూరలో వచ్చి ఉండదని, భోజనం చేస్తున్న సమయంలో పైనుంచి పడి ఉంటుందని సర్ది చెప్పడంతో విద్యార్థి మిన్నకుండిపోయాడు. అయితే మంగళవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత నెల 21న బాలికల హాస్టల్ అల్పాహారంలో బల్లి రావడం, ఈ నెల 18న అదే హాస్టల్ భోజనంలో పురుగు రావడం మరవక ముందే మళ్లీ న్యూ బాయ్స్ హాస్టల్‌లో బొద్దింక రావడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భోజనంలో పురుగులు వస్తున్నా చీఫ్ వార్డెన్, వార్డెన్‌లు, కేర్‌టేకర్‌లు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. హాస్టల్స్‌లో వరుసగా ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా రిజిస్ట్రార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ ఎం యాదగిరిని సంప్రదించగా పురుగు వచ్చిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. మంగళవారం తాను న్యూబాయ్స్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్లు తెలిపారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు ఎవరూ కూడా బొద్దింక విషయమై తనకు చెప్పలేదన్నారు. గత నెలలో అల్పాహారంలో కీటకం వస్తే హెడ్ కుక్‌ను సస్పెండ్ చేశామన్నారు. కొందరు పనిగట్టుకుని వర్సిటీ పరువుకు భంగం కలిగించేలా విద్యార్థులతో ఇదంతా చేయిస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



న్యూబాయ్స్ హాస్టల్ భోజనంలో వచ్చిన బొద్దింక

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి



రామ్‌గోపాల్‌రెడ్డి (ఫైల్)

సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు కాట్‌పల్లి రామ్‌గోపాల్‌రెడ్డి (75) మృతి చెందారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న రాంగోపాల్‌రెడ్డి సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్‌కు చెందిన రామ్‌గోపాల్‌రెడ్డి 1991–93 వరకు నిజామాబాద్ నగర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. అమెరికాలో ఉంటున్న ఆయన కుమార్తె వచ్చిన తర్వాత బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామ్‌గోపాల్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్‌గోపాల్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, బాల్‌రాజు, భరత్ భూషణ్, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ ఉన్నారు.

నిజామాబాద్ పట్టణాధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పార్టీకి సేవలందించిన రామ్‌గోపాల్‌రెడ్డి మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి




న్యూ బాయ్స్ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి హెచ్చరించారు. తెయూ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్ హాస్టల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, మెస్ హాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిసరాలతో పాటు వంటగది, మెస్‌హాల్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు కిటికీలకు జాలీలను సరి చేయించాలని ఏఈ వినోద్‌ను ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ఏఈ వినోద్, చీఫ్ వార్డెన్ మహేందర్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్ వర్ధన్‌రెడ్డి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట కేర్ టేకర్స్ క్రాంతి కుమార్, దిగంబర్ చౌహాన్, రమేశ్ ఉన్నారు.

రేపు విద్యుత్ శాఖ ఎస్ఈతో సాక్షి ఫోన్ ఇన్

జిల్లాలో ఎదురయ్యే విద్యుత్ సమస్యలపై ఎస్ఈ రాపెల్లీ రవీందర్‌తో ‘సాక్షి’ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు, వినియోగదారులు లూజ్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్, విద్యుత్ సరఫరాలో అంతరాయం, లోఓల్టేజ్, హై ఓల్టేజ్, మీటర్ రీడింగ్‌లో తప్పులు, జీరో బిల్లుల్లో ఇక్కట్లను నేరుగా ఎస్ఈ దృష్టికి తీసుకురావొచ్చు.



రవీందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ

తేది : 25-07-2024 (గురువారం)

సమయం: ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం12:00 గంటల వరకు.

ఫోన్ చేయాల్సిన నంబర్ : 89780 36828

క్లుప్తంగా

నాణ్యమైన విద్యనందించాలి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం అన్ని విభాగాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, యుడైస్ క్రమబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ నియంత్రణ కమిటీల ఏర్పాటు చేయాలని, పాఠ్యపుస్తకాలు, దుస్తులు సకాలంలో విద్యార్థులకు అందించి విద్య బోధన సక్రమంగా జరిగేలా చూడాలని, ఏకో క్లబ్స్, వన మహోత్సవం, పరిశుభ్రత, శిక్షసప్త, మధ్యాహ్న భోజనం పకడ్బందీగా ఉండాలన్నారు. టీచర్ల కొరత, ఇతర సమస్యల ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల భవనాలకు సంబంధించి మరమ్మతుల వివరాలను తెలుపాలన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈనెల 25వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాకు మెడిపెస్ కంపెనీలో ఫార్మాసిస్ట్, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డి ఫార్మసీ, ఎంఫార్మసీ అండ్ పీసీఐ పాసైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని, మరిన్ని వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్ 6, 8, 7, 9, 10వ సెమిస్టర్, పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 71 మంది విద్యార్థులకుగాను 71 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 159 మందికి 148 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

బ్యాక్‌లాగ్ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీ (కామారెడ్డి), ఎస్ఆర్ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 48 విద్యార్థులకు గాను 47 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని, అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురూ గైర్హాజరయ్యారని తెలిపారు.

నిరాశే మిగిలింది..!

కేంద్ర బడ్జెట్‌పై ఆయా వర్గాలు పెదవి విరుస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తెలంగాణ ఊసెత్తలేదని, జిల్లాకు నిధులు కేటాయించలేదని అంటున్నారు. జిల్లా ప్రజలు ప్రధానంగా ఆశించిన పసుపు బోర్డు, నిజాం షుగర్స్, బీదర్ రైల్వే లైన్ ప్రస్తావన లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయా వర్గాల అభిప్రాయాలు వారి మాటల్లో..

– ఖలీల్‌వాడి/తెయూ(డిచ్‌పల్లి)/నిజామాబాద్‌నాగారం

వికసిత భారత్ కల నెరవేరుతుందా?



సామాన్యులతోపాటు వేతనజీవులకు, మధ్యతరగతికి ఈ బడ్జెట్‌తో ఎలాంటి ప్రయోజనం లేదు. కార్పొరేట్లకే పెద్దపీట వేశారు. అనేక ఆశలు, భారీ అంచనాల మధ్య వికసిత్‌భారత్ లక్ష్యంగా రూ.48.21 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొత్తం ఆదాయం కేవలం రూ.32.07 లక్షల కోట్లు మాత్రమే. ఇందులో పన్ను ఆదాయం రూ.28.83 లక్షల కోట్లు కాగా అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లో 34 శాతం అప్పులతో వికసిత భారత్ కలనెరవేరుతుందా? అనేది పెద్ద ప్రశ్న. – డాక్టర్ ఏ.పున్నయ్య, హెచ్‌వోడీ ఎకనామిక్స్, తెయూ

ఇది సంకీర్ణ ప్రభుత్వ బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సంకీర్ణ ప్రభుత్వ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. గత బడ్జెట్‌లకు పూర్తి భిన్నంగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వంలో పెద్ద భాగస్వామ్య పార్టీ రాష్ట్రాలకు పెద్ద పీట వేయడం రాజకీయ ప్రయోజనాలను సూచిస్తోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11.11 లక్షల కోట్లు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం అభినందనీయం. ఏంజెల్ ట్యాక్స్ రద్దుతో స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఏర్పడుతుంది. ముద్ర, విద్య రుణాలు పెంచడం హర్షణీయం. – కే.రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఎకనామిక్స్, తెయూ

మార్పులను స్వాగతించాలి



పన్ను విధానంలో మార్పులను స్వాగతించాలి. సున్నా నుంచి రూ.3 లక్షల వరకు పన్ను సున్నా అని రూ.3 లక్షల నుంచి 7 లక్షల వరకు 5 శాతం, రూ.7 లక్షల నుంచి 10 లక్షల వరకు 10 శాతం, రూ.10 లక్షల నుంచి 12 లక్షల వరకు 15 శాతం, రూ.12 లక్షల నుంచి 15 లక్షల వరకు 20 శాతం, రూ.15 లక్షల పైన 30 శాతం ట్యాక్స్ కొత్త విధానంలో నగటున రూ.17,500 పన్ను ఆదా అవుతుంది. మధ్యతరగతి వారికి చాలా ప్రయోజనంగా ఉంటుంది. – పాత నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్, తెయూ

తెలంగాణకు మొండి చేయి



తెలంగాణపై బీజేపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపుతోంది. నిజాం షుగర్స్‌ను తెరిపించడంతోపాటు జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేస్తామన్న విమానాశ్రయానికి నిధుల కేటాయింపు ఊసే లేదు. దీనిపై ఎంపీ అర్వింద్ స్పష్టత ఇవ్వాలి. – రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

వేతన జీవులకు నిరాశ



బడ్జెట్‌లో ఉద్యోగులకు యూ/ఎస్ 80 సీ పొదుపును ప్రోత్సహించేలా లేదు. పొదుపు పథకాల్లో పాత పద్ధతినే కొనసాగిస్తూ వచ్చారు. ఆదాయపు పన్ను పరిమితిలో స్వల్ప మార్పులు చేసి అల్పాదాయ వర్గాలను నిరాశ పరిచారు. గృహ రుణాలపై వడ్డీ పరిమితిని పెంచలేదు. ఇలా అయితే ఉద్యోగ వర్గాల్లో కేంద్ర ప్రభుత్వంపై నమ్మకం పోయేలా ఉంది. – బట్టు క్రిష్టారెడ్డి, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్

ఊరట దక్కుతుందని ఆశించాం



ఆదాయ పన్ను చెల్లించే మధ్యతరగతి వేతన జీవులకు బడ్జెట్‌లోనైనా ఊరట దక్కుతుందని ఆశించాం. ఐటీ స్లాబును సవరించాలని, స్టాండర్డ్ డిడక్షన్ కనీసం లక్షకు పెంచాలనేది ప్రధాన డిమాండ్. పన్ను మినహాయింపును ప్రస్తుతం రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతోపాటు పాత విధానంలో మినహాయింపులను పెంచుతారని ఆశించాం. కానీ పన్ను మినహాయింపులో పెద్దగా మార్పు లేకపోవడంతో నిరాశ చెందాం. – కె.రామ్మోహన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పసుపుబోర్డు ఊసేలేదు



పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారు, ఎన్ని నిధులు కేటాయిస్తారనే దానిపై స్పష్టత లేదు. ఎంపీ అర్వింద్ పసుపు రైతులకు సమాధానం చెప్పాలి. బీదర్ రైలు మార్గంతోపాటు డబ్లింగ్ పనులపై స్పష్టత లేదు. – వి.ప్రభాకర్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, జిల్లా ప్రధానకార్యదర్శి

విభజన హామీలు నెరవేర్చాలి



రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలి. మోదీ ప్రభుత్వం పక్షపాత ధోరణిని అవలంబిస్తోంది. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, గిరిజన విశ్వవిద్యాలయం, కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదు. – సుధాకర్, సీపీఐ నాయకుడు

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

- ఎక్సైజ్ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఖలీల్‌వాడి: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిని పట్టుకుని వదిలేశారనే ఆరోపణల నేపథ్యంలో ఓ చోట ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు.. మరో చోట ఎస్‌హెచ్‌వోపై చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. బోధన్ ఎక్సైజ్ పరిధిలోని పెగడపల్లి బెల్ట్‌షాపులో మద్యం పట్టుకొని కేసు నమోదు చేయలేదనే ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టిన జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి.. ఎస్‌హెచ్‌వో రూప్‌సింగ్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా, జిల్లా కేంద్రంలోని గుర్బాబాది రోడ్డులో ఉన్న కల్లుబట్టీలో తనిఖీలు చేపట్టిన ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుష్మ మద్యం పట్టుకున్నారు. అయితే, ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు ఫోన్లు రావడంతో దాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ విషయం బయటికి పొక్కినా బాధ్యులపై ఉన్నతాధికారుల చర్యలు కరువయ్యాయి. ఎస్‌హెచ్‌వోతోపాటు ఎస్సైను కాపాడేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆ శాఖ సిబ్బందే చర్చించుకుంటున్నారు. బోధన్‌లో ఓ న్యాయం.. నిజామాబాద్‌లో ఓ న్యాయమా? అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్‌కు నివేదించాం

గుర్బాబాది రోడ్డులోని కల్లుబట్టీలో మద్యం పట్టుబడగా నిర్వాహకులను ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుష్మ హెచ్చరించి వదిలేశారు. మళ్లీ అదే కల్లు బట్టీలో 22వ తేదీన తనిఖీలు నిర్వహించగా మళ్లీ మద్యం పట్టుబడడంతో నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు పంపించాం. – మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

మళ్లీ తనిఖీ.. కేసు నమోదు

ఈనెల 16న జిల్లా కేంద్రంలోని గుర్బాబాది రోడ్డులో ఉన్న కల్లు బట్టీలో మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్, ఎస్సై సుష్మ దాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి 'కల్లు బట్టీలో మద్యం పట్టివేత' శీర్షికన ఈనెల 21న 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా, కల్లుబట్టీలో 16వ తేదీన మద్యం పట్టుబడగా నిర్వాహకులను హెచ్చరించి వదిలేశామని, వారు తీరు మారకపోవడంతో మళ్లీ 22వ తేదీన తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశామని అంటున్నారు. హడావుడి చేసిన అధికారులు ఎస్‌హెచ్‌వోతోపాటు ఎస్సైపై చర్యల ఊసెత్తకుండా అదే కల్లుబట్టీలో మళ్లీ తనిఖీలు నిర్వహించి విషయాన్ని పక్కదారి పట్టించారనే పలువురు పేర్కొంటున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్ కోర్టు పీపీగా రామకృష్ణ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జీ రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ కోర్టులో పీపీగా విధులు నిర్వర్తించిన రామకృష్ణ బదిలీపై ఆర్మూర్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, భీమ్‌గల్ సీఐ నవీన్, ఎస్సైలు అశోక్, గంగాధర్, హరిబాబు, రాజశేఖర్, మచ్చేందర్, లిల్లీపుట్ పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాక్లూర్ సొసైటీలో విచారణ ప్రారంభం



విచారణ జరుపుతున్న అసిస్టెంట్ రిజిస్టర్ రమావతి

మాక్లూర్: జిల్లాలోనే అతిపెద్ద సొసైటీగా గుర్తింపు ఉన్న మాక్లూర్ సొసైటీలో రూ.2 కోట్లకు పైగా అవినీతి జరిగిందనే ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మంగళవారం ఉదయం అసిస్టెంట్ రిజిస్టర్ కె రమావతి ఆధ్వర్యంలో విచారణ ప్రారంభమైంది. ప్రస్తుత కార్యదర్శులు విష్ణువర్ధన్, సంతోష్‌ను తాత్కాలికంగా బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు తెలిపారు. 2022 నుంచి 2024కు సొసైటీ లావాదేవీల రికార్డులను అప్పగించాలని కార్యదర్శి సంతోష్‌ను ఆదేశించగా, ఆ రికార్డులు నిజామాబాద్ డీసీవో కార్యాలయంలో ఉన్నాయని కార్యదర్శి తెలిపారు. రమావతి వెంటనే డీసీవో కార్యాలయానికి ఫోన్ చేయగా, తన వద్దే ఉన్నాయని సంతోష్ సమాధానం చెప్పారు. రికార్డులు తారుమారు చేస్తే చర్యలు తప్పవని, బుధవారం రికార్డులను అప్పగించాలని సంతోష్‌కు నోటీసు ఇచ్చారు.

కొత్త కార్యదర్శిని నియమించాలి

సొసైటీ కార్యదర్శులుగా ఉన్న విష్ణువర్ధన్, సంతోష్‌ను విచారణ అనంతరం మరో చోటికి బదిలీపై పంపించాలని, నూతన కార్యదర్శిని నియమించాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. చైర్మన్ బూరోల్ల అశోక్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఇద్దరు కార్యదర్శులు ఉండటంతో సొసైటీ డైరెక్టర్లు రెండు గ్రూపులుగా ఏర్పడుతున్నారని సభ్యులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో తెయూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంకాం విద్యార్థులకు ప్రతి ఏటా నిర్వహించే రాష్ట్రస్థాయి వాణిజ్య సదస్సులో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. ఈ నెల 19, 20వ తేదీల్లో ఓయూలో నిర్వహించిన సోలో డ్యాన్స్‌లో ఆర్ గంగోత్రి (ప్రథమ), గ్రూప్ డ్యాన్స్‌లో డి రాము బృందం (ద్వితీయ) బహుమతులు సాధించినట్లు కామర్స్ హెచ్‌వోడీ రాంబాబు తెలిపారు. అలాగే వ్యాపార ప్రణాళిక తయారీలో బి.గోపాల్, హర్షవర్ధన్ ప్రత్యేక బహుమతితోపాటు కేస్ స్టడీస్‌లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులతోపాటు కామర్స్ హెచ్‌వోడీ, డీన్ రాంబాబును రిజిస్ట్రార్ ఎం.యాదగిరి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. కామర్స్ అధ్యాపకులు జి.శ్రీనివాస్, గంగాధర్, శ్వేత, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైవే బ్రిడ్జి కుంగలేదు

- జాయింట్ వద్ద గుంతలు.. మరమ్మతులు చేపట్టిన హైవే అథారిటీ సిబ్బంది
- సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాల మళ్లింపు
- అధికారుల వెల్లడి



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వద్ద నేషనల్ హైవే బ్రిడ్జి కుంగినట్లు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం హైవే అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డును పరిశీలించారు. రోడ్డు కుంగలేదని, ఒక ఇనుప పట్టి విరిగిందని, దాని పక్కన ఉన్న డాంబార్ వర్షపు తాకిడికి లేచి పోయిందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఆ గుంతలోనుంచి వెళితే వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతుల నేపథ్యంలో నాలుగు రోజులు వరకు నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న వాహనాలను సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఉమ్మడి బాల్కొండలో వరుస దొంగతనాలు
- బెంబేలెత్తుతున్న జనాలు



ఇంట్లో చిందరవందరగా పారేసిన వస్తువులు (ఫైల్)

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలం(బాల్కొండ, ముప్కాల్, మెండోరా)లో తాళం వేసిన ఇళ్లను దుండగులు టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన లింగన్న గత శుక్రవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా దుండగులు పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. 8.5 తులాల బంగారం, 50 వేల నగదు ఎత్తుకెళ్లారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన లింబాద్రి ఇంటికి తాళం వేసి వెళ్లగా సోమవారం పట్టపగలు ఇంట్లోకి చొరబడిన దుండగులు 9 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అదే రోజున మెండోరా మండలం దూదిగాంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి విఫలయత్నం చేసి పారిపోయినట్లు తెలిసింది. ఇలా రోజుకోచోట చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు మాత్రం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బంగారు ఆభరణాలు, నగదు టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇతర ఏ సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీలకు అడ్డుకట్ట పడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారి పక్క గ్రామాల్లోనే చోరీలు

బాల్కొండ మండలం చిట్టాపూర్, ముప్కాల్ మండల కేంద్రం, మెండోరా మండలం దూదిగాంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరుగగా, ఈ మూడు గ్రామాలు కూడా జాతీయ రహదారి 44 ఆనుకుని ఉన్నవే కావడం గమనార్హం. దుండగులు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలనే టార్గెట్ చేసి చోరీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన రెండు ఏటీఎంలు సైతం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నవే. 2022లో మెండోరా మండలం బుస్సాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో భారీ చోరీ జరగగా, 8 కిలోల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. రెండేళ్లు గడిచినా చోరీకి పాల్పడిన దుండగులందరినీ ఇప్పటి వరకు పట్టుకోలేదు. కొందరిని అరెస్టు చేయగా కొంత మేర బంగారం రికవరీ అయ్యింది.

క్రైం కార్నర్

ఏటీఎంలలో భారీ చోరీ..

బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో గత నెల 4వ తేదీన భారీ చోరీ జరిగింది. కేవలం 9 నిమిషాల వ్యవధిలోనే దుండగులు రూ.25 లక్షల నగదును లూటీచేశారు. ఆ కేసు ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. గతేడాది సెప్టెంబర్‌లో మెండోరా మండలం పోచంపాడ్ కూడలి వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నుంచి రూ.12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఆ కేసులో లారీ డ్రైవర్‌ను మాత్రం అరెస్ట్ చేసినప్పటికీ దుండగులను పట్టుకోలేదు.

పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత

- ముగ్గురిని విచారిస్తున్న పోలీసులు
- ఘటనాస్థలానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు



మృతదేహాన్ని వెలికితీయిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన జీర్ల చిన్న మల్లయ్య అనే వ్యక్తి హత్యకు గురికాగా, మృతదేహాన్ని మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వెలికితీశారు. ఘటనా స్థలానికి గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మృతదేహాన్ని బయటకి తీయించి కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. హత్య కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్సై రాజు, తహశీల్దార్ గంగాసాగర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన పిట్ల రాజయ్య అనే కూలీ సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసింది. ఈ కేసులో మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మేస్త్రి పులబోయిన శంకర్‌తోపాటు మాజీ సర్పంచ్ నల్లవు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్య చారి మంగళవారం తెలిపారు. శ్రీనివాస్ ఇంటి నిర్మాణ చేపడుతుండగా.. రాజయ్య కూలీ పనికి వెళ్లాడన్నారు. ఇంట్లో ట్యూబ్ లైట్‌పాడవడంతో కొత్తది బిగించాలని రాజయ్యకు శ్రీనివాస్ సూచించాడని తెలిపారు. రాజయ్య ట్యూబ్‌లైట్ బిగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలిందని, బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడన్నారు.

భూమి చదును చేస్తుండగా అడ్డుకున్న వారిపై..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న పలువురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన లింగ మహేందర్, రాఘవేందర్ 2022లో గోపాల్‌పేటలోని సర్వేనెంబర్ 508లో నాలుగుగుంటల భూమిని ప్రవీణ్ వద్ద కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమిని చదును చేసేందుకు మహేందర్, రాఘవేందర్ వారిబంధువులతో కలిసి మంగళవారం గ్రామానికి రాగా అదే గ్రామానికి చెందిన షాహెద్‌పాషా, అతని తమ్ముడు బిలాల్‌తోపాటు అతని తల్లి అడ్డుకున్నట్లు మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాహెద్‌పాషా, బిలాల్‌తోపాటు అతని తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పేకాటస్థావరంపై దాడి

బోధన్ రూరల్(బోధన్): సాలురా మండలంలోని సాలురా క్యాంపులో పేకాటస్థావరంపై మంగళవారం దాడి చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.1,320 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: పట్టణంలోని టీచర్స్ కాలనీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,300 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

బాల్కొండ: ప్రమాదవశాత్తు బహ్రెయిన్‌లో మృతి చెందిన మెండోరా మండల కేంద్రానికి చెందిన మాకూరి వినోద్(35) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. ప్రవాస భారతీయుల హక్కుల కమిటీ అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు, బహ్రెయిన్‌లోని తెలుగు కళా సమితి కన్వీనర్ నోముల మురళి, మాకూరి గంగాధర్.. వినోద్ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు కృషి చేశారని గ్రామస్తులు తెలిపారు. వినోద్ అంత్యక్రియలను మంగళవారం గ్రామంలో పూర్తి చేశారు.

డీటీఎఫ్ నాయకుల విచారణ

నిజామాబాద్‌అర్బన్: పదోన్నతుల ప్రక్రియలో అవినీతికి పాల్పడ్డారని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌పై ఆరోపణలు చేసిన డీటీఎఫ్ నాయకులను రూరల్ పోలీసులు విచారించారు. డీఈవో అక్రమాలకు పాల్పడ్డారని డీటీఎఫ్ రాష్ట నాయకుడు శాంతన్, జిల్లా నాయకులు బాలయ్య, ఓమాజీ మీడియాకు ప్రకటన విడుదల చేయగా, డీఈవో ఈ నెల 1వ తేదీన రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ డీటీఎఫ్ నాయకులు పత్రికాప్రకటనలు విడుదల చేశారు. దీనిపై సీరియస్ అయిన డీఈవో పోలీస్ కమిషనర్‌కు మరోసారి ఫిర్యాదు చేయగా, దీనిపై విచారణ చేపట్టాలని సీపీ రూరల్ పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీటీఎఫ్ నాయకులు శాంతన్, బాలయ్య ఓమాజీని సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. అనంతరం ఏసీపీ కార్యాలయానికి కూడా పిలిపించినట్లు తెలిసింది. దీనిపై రూరల్ పోలీసులను వివరణ కోరగా.. డీటీఎఫ్ నాయకులను పిలిపించింది వాస్తవమేనని, విచారణ కొనసాగుతోందని తెలిపారు. డీటీఎఫ్ నాయకులు సైతం తాము పోలీసు విచారణకు హాజరైనట్లు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద



బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద పెరిగింది. 25 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు 23 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 291 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా, మంగళవారం రాత్రి వరకు 1070.10(23.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

నిజామాబాద్‌రూరల్: ఈనెల 11వ తేదీన యాసిడ్‌తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజయ్య అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. ముబారక్‌నగర్ ప్రాంతానికి చెందిన రాజయ్య(46) ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగాడని, గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాజయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సూపర్‌మార్కెట్ దగ్ధం



ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో ఉన్న శ్రీమార్ట్ సూపర్ మార్కెట్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం షాపులో నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో రెండు ఫైర్ ఇంజిన్లు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రూ.70లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని షాపు యజమాని శ్రీవాణి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.